www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

వాసన వస్తున్న చికెన్.. విద్యార్థుల ఆందోళన!



5 లో..

సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు



3 లో..

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 245, సోమవారం 5-10-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam



సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ఉన్నతస్థాయి సమీక్ష

పెండింగ్ పనులు వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు

భూసేకరణ, పునరావాస అంశాలపై విస్తృత చర్చ

రైతులకు సకాలంలో సాగునీరు అందించడమే లక్ష్యం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2లో

కరువుపై ప్రత్యేక కేబినెట్ ఏర్పాటు చేయాలి: కవిత



- రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వాలి
- ప్రభుత్వ వైఫల్యాలపై కవిత విమర్శలు
- పేపర్ బ్యాలెట్ విధానం తీసుకురావాలని డిమాండ్
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, అక్టోబర్ 4 :

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కరువును ఎదుర్కోవడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వెంటనే ప్రత్యేక కేబినెట్ సమావేశం నిర్వహించి కరువు, రైతు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తీవ్రమవుతున్నప్పటికీ ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ రూపొందించలేదని ఆమె ఆరోపించారు. జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైందని, దీనివల్ల భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోయాయని పేర్కొన్నారు.

మిగతా 2లో

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. తెలంగాణ యువతి మృతి

- మహబూబాబాద్ జిల్లాకు చెందిన సుప్రియ దుర్మరణం
- ట్రక్ ఢీకొట్టడంతో ఘటన
- కుటుంబంలో విషాదం

మహబూబాబాద్, అక్టోబర్ 4 :



అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన యువతి మృతిచెందిన ఘటన విషాదాన్ని నింపింది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలానికి చెందిన దారం సుప్రియ (31) ఉద్యోగ రీత్యా అమెరికాలోని మిస్సోరి రాష్ట్రంలో నివాసం ఉంటున్నారు. ఆదివారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతిచెందినట్లు సమాచారం. అధికారుల వివరాల ప్రకారం సుప్రియ భారత్‌కు చెందిన మరో మహిళతో కలిసి ఆదివారం ఉదయం రెండు గంటల సమయంలో కారులో ప్రయాణం ప్రారంభించారు. ఈ క్రమంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్రక్ వారి కారును బలంగా ఢీకొట్టింది.

మిగతా 2లో



యువత ఉద్యోగార్థులు కాదు.. ఉద్యోగ కల్పనదారులు కావాలి

- క్రమశిక్షణ, నైతికత విజయానికి పునాది
- విద్యకు సామాజిక బాధ్యత జత కావాలి
- కర్నూలు కళాశాల వార్షికోత్సవంలో వెంకయ్య నాయుడు

హైదరాబాద్, అక్టోబర్ 4 :

యువత కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూసే ఉద్యోగార్థులుగా కాకుండా, పదిమందికి ఉపాధి కల్పించే ఉద్యోగ కల్పనదారులుగా ఎదగాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో నిర్వహించిన

మిగతా 2లో

సకల జనుల సమ్మెపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

- ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు వినతి
- అరెస్టులు, ఆంక్షలపై అభ్యంతరం
- ఢిల్లీలో వినతిపత్రం సమర్పణ

న్యూఢిల్లీ, అక్టోబర్ 4 :

తెలంగాణ ఉద్యమంలో కీలక ఘట్టంగా నిలిచిన సకల జనుల సమ్మె సందర్భంగా చోటుచేసుకున్న మానవ హక్కుల ఉల్లంఘనల అంశాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఢిల్లీలో జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు వినతిపత్రం సమర్పించి, సమ్మె సమయంలో చేపట్టిన పోలీసు చర్యలపై విచారణ జరిపించాలని కోరారు.

మిగతా 2లో





సిద్దిపేట పదేళ్ల పండుగకు ఘన సన్నాహాలు

- జిల్లా ఖ్యాతి దేశవ్యాప్తంగా చాటేలా వేడుకలు
- మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయం
- అన్నివర్గాల భాగస్వామ్యంతో వేడుకలకు రూపకల్పన
- మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు

సిద్దిపేట, అక్టోబర్ 4 :

సిద్దిపేట జిల్లా ఆవిర్భావానికి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పిలుపునిచ్చారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో కవులు, కళాకారులు, జర్నలిస్టులు, వైద్యులు, న్యాయవాదులు, వ్యాపారులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు, ప్రజాసంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా ఖ్యాతి, కీర్తి ఎల్లలు దాటేలా పదేళ్ల పండుగను నిర్వహించాలని సూచించారు.

మిగతా 2లో

DHANVANTHARI INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES
(Approved by PCI New Delhi & Affiliated to JNTUH, Hyderabad)
SUJATHANAGAR, KOTHAGUDEM, BHADRADRI KOTHAGUDEM-DIST – 507120
Phone no. 9705065656,7893055033

SPOT ADMISSIONS NOTIFICATION FOR M.PHARMACY

Course wise vacancies position :M.Pharmacy : pharmaceutics- 04
Ph.analysis-06 Interested candidates can attend for SPOT Admission counseling to be conducted as per the guideline of the TGPGECET CONVENOR, 2026 for above mentioned vacancy on before 05-10-2026 with all original certificates and related fee.

Note:- Candidates admitted under Spot Admissions are not eligible for any FEE exemption /Re-imbursement.

Sd/- Secretary & Correspondent

భద్రాద్రి న్యూస్
www.bhadradrinews.com
తెలుగు దినపత్రిక
Follow : @bhadradrinews
సోమవారం
5 । అక్టోబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ఉన్నతస్థాయి సమీక్ష

నల్గొండ, అక్టోబర్ 4 :



ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టుల నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలు, పెండింగ్ పనుల స్థితిగతులు, పూర్తి చేయాల్సిన లక్ష్యాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. రైతులకు సకాలంలో సాగునీరు అందేలా అన్ని ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ప్రధానంగా భూసేకరణ ప్రక్రియపై విస్తృతంగా చర్చించారు. ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూముల సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. భూసేకరణ ఆలస్యం వల్ల ప్రాజెక్టుల నిర్మాణ పనులు ప్రభావితం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

పునరావాసం, పునర్నిర్మాణ పరిహారానికి సంబంధించిన అంశాలు కూడా సమావేశంలో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయి. నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారాన్ని నిబంధనల ప్రకారం వేగంగా అందించాలని, వారి సమస్యలను మానవీయ దృక్పథంతో పరిష్కరించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. ప్రాజెక్టుల అభివృద్ధితో పాటు ప్రజల ప్రయోజనాలు కూడా సమానంగా పరిరక్షించబడాలని పేర్కొన్నారు. అటవీ శాఖ అనుమతులకు సంబంధించిన పెండింగ్ అంశాలను కూడా సమీక్షించారు. వివిధ ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు త్వరగా పొందేందుకు శాఖల మధ్య సమన్వయం పెంచాలని అధికారులకు సూచించారు. పరిపాలనా, సాంకేతిక అనుమతుల ప్రక్రియలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ప్రాజెక్టులు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. నిర్ణీత గడువుల్లో పనులు పూర్తి చేసి ప్రజలకు ఫలితాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ సమీక్ష సమావేశంలో పార్లమెంట్ సభ్యుడు కుందూరు రఘువీర్ రెడ్డి, శాసన మండలి సభ్యుడు శంకర్ నాయక్, ప్రభుత్వ విప్‌లు, ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ పనులు వేగవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. తెలంగాణ యువతి మృతి

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాద తీవ్రతకు కారు పూర్తిగా ధ్వంసమవగా, సుప్రియ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

ప్రమాదంలో కారులో ఉన్న మరో మహిళకు గాయాలయ్యాయి. ఆమెను సమీప వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను స్థానిక అధికారులు సేకరిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. సుప్రియ మృతి వార్త మహబూబాబాద్ జిల్లాలోని ఆమె కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. మృతురాలి భర్త కొదుమూరి రంజిత్, అత్త మామలు మహబూబాబాద్ పట్టణంలోని వీరభద్ర అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

ఉద్యోగ అవకాశాల కోసం విదేశాలకు వెళ్లిన సుప్రియ అనుకోని రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో బంధువులు, స్నేహితులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆమె మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి కుటుంబ సభ్యులు ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం. ఈ ఘటనపై స్థానిక ప్రజాప్రతినిధులు, పరిచయస్తులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. విదేశాల్లో నివసిస్తున్న తెలుగు కుటుంబాల భద్రతపై మరోసారి చర్చకు దారితీసిన ఈ ఘటన మహబూబాబాద్ జిల్లాలో విషాద ఛాయలు నింపింది.

కరువుపై ప్రత్యేక కేబినెట్ ఏర్పాటు చేయాలి: కవిత



(మొదటి పేజీ తరువాయి)

అనేక ప్రాంతాల్లో రైతులు పంటలను కాపాడుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారని, కొందరు పంటలను నాశనం చేసుకునే పరిస్థితులు కూడా ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ఇంకా భారీ స్థాయిలో సాగు విస్తీర్ణం ఉన్నందున నవంబర్ వరకు రైతులకు ఇరవై నాలుగు గంటల ఉచిత త్రీఫేజ్ విద్యుత్ అందించాలని కవిత డిమాండ్ చేశారు. ప్రస్తుతం గ్రామాల్లో ఆరు నుంచి ఏడు గంటల పాటు కూడా నిరంతర విద్యుత్ సరఫరా లేదని ఆరోపించారు. విద్యుత్ సరఫరా లోపంతో బోర్ల ద్వారా నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. కరువు మండలాలను వెంటనే ప్రకటించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. పొరుగు రాష్ట్రాలు ఇప్పటికే కరువు ప్రభావిత ప్రాంతాలను గుర్తించి చర్యలు ప్రారంభించాయని, తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఆ దిశగా ముందుకు సాగడం లేదని విమర్శించారు. కరువు మండలాల ప్రకటన ద్వారా కేంద్ర సహాయం పొందే అవకాశం ఉంటుందని చెప్పారు.

దక్షిణాది రాష్ట్రాల్లో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సహాయ చర్యలు చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. విద్యుత్ ఉత్పత్తి అధికంగా ఉన్న రాష్ట్రాల నుంచి దక్షిణాది రాష్ట్రాలకు విద్యుత్ అందించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. తెలంగాణకు కేంద్రం మరింత ఆర్థిక, సాంకేతిక సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఎన్నికల వ్యవస్థపై కూడా కవిత స్పందించారు. దేశంలో మళ్లీ పేపర్ బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పారదర్శకత పెంచేందుకు ఇది అవసరమని పేర్కొంటూ, ఈ అంశంపై తమ పార్టీ జాతీయ స్థాయిలో పోరాటం చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ఎలాంటి ఎన్నికలు వచ్చినా తమ పార్టీ పోటీ చేస్తుందని, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

యువత ఉద్యోగార్థులు కాదు.. ఉద్యోగ కల్పనదారులు కావాలి

(మొదటి పేజీ తరువాయి)



కర్నూలు సిల్వర్ జూబిలీ డిగ్రీ కళాశాల 2026 వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. క్రమశిక్షణ, నైతిక విలువలకు నిలయంగా పేరుగాంచిన ఈ విద్యాసంస్థ ఎందరో మేధావులను దేశానికి అందించిందని పేర్కొన్నారు. ఈ కళాశాలలో చదువుకున్న అనేక మంది విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నత స్థానాలను అధిరోహించడం గర్వకారణమని వెంకయ్య నాయుడు అన్నారు. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, విలువలు, క్రమశిక్షణను అందించిన ఈ విద్యాసంస్థ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విద్యారంగానికి అందించిన గొప్ప కానుకగా నిలిచిందని కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో విద్యాసంస్థల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.

ఏ రంగంలోనైనా శాశ్వత విజయాన్ని సాధించాలంటే ఓర్పు, దీక్ష, నిరంతర కృషి అవసరమని ఆయన సూచించారు. కష్టపడకుండా విజయాలు సాధించాలనే ఆలోచన సరైనది కాదని, జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించాల్సిందేనని విద్యార్థులకు సూచించారు. యువత తమ సామర్థ్యాలను గుర్తించి కొత్త అవకాశాలను సృష్టించే దిశగా ముందుకు సాగాలని అన్నారు. ప్రస్తుత విద్యా వ్యవస్థలో పరిశ్రమల అవసరాలకు, విద్యా సంస్థల్లో బోధించే పాఠ్యాంశాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. విద్యార్థులు విద్య పూర్తి చేసిన తర్వాత ఉపాధి అవకాశాలు సులభంగా పొందేలా పాఠ్యాంశాలను కాలానుగుణంగా రూపొందించాలని సూచించారు. విద్య కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా జీవిత నైపుణ్యాలను పెంపొందించేలా ఉండాలని అభిప్రాయపడ్డారు.

ఉపాధ్యాయుల పాత్రపై కూడా ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఉపాధ్యాయులు కేవలం పాఠాలు బోధించే వారిగానే కాకుండా విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే మార్గదర్శకులుగా ఉండాలని సూచించారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు కృషి చేయాలని అన్నారు. మంచి గురువులే మంచి పౌరులను తయారు చేస్తారని పేర్కొన్నారు. సమాజంలో చదువుకున్న ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతను గుర్తించాలని వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. కేవలం సంపాదన ఒక్కటే జీవిత లక్ష్యం కాకూడదని, తాము నివసించే సమాజానికి, దేశానికి ఏమి తిరిగి ఇస్తున్నామనే ఆలోచన ప్రతి యువకుడిలో ఉండాలని అన్నారు. విద్య, విలువలు, సామాజిక బాధ్యత కలిసినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొంటూ యువత దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

సిద్దిపేట పదేళ్ల పండుగకు ఘన సన్నాహాలు

(మొదటి పేజీ తరువాయి)

సిద్దిపేట జిల్లా కోసం దశాబ్దాల పాటు సాగిన ఉద్యమం, ఆకాంక్షలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలని హరీశ్ రావు అన్నారు. 1983 నుంచే సిద్దిపేట జిల్లా డిమాండ్ ప్రజల్లో బలంగా ఉన్నప్పటికీ అది చాలా కాలం నినాదంగానే మిగిలిపోయిందని పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ 2016 అక్టోబర్ 11న సిద్దిపేట జిల్లాను ఏర్పాటు చేసి చరిత్రలో సువర్ణ అధ్యాయాన్ని లిఖించారని అన్నారు. జిల్లా ఏర్పాటు ద్వారా ప్రజలకు పరిపాలన మరింత చేరువైందని పేర్కొన్నారు.

జిల్లా ఏర్పాటుకు ముందు ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, జర్నలిస్టులు, వ్యాపారులు, విద్యార్థులు వివిధ అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని గుర్తు చేశారు. జిల్లా ఏర్పడిన తర్వాత పరిపాలనా సౌకర్యాలు విస్తరించడంతో పాటు అభివృద్ధి వేగవంతమైందని చెప్పారు. గోదావరి జలాలు, రైల్వే సౌకర్యాలు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి ఎన్నో అంశాలు సిద్దిపేట ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చాయని వివరించారు. సిద్దిపేట జిల్లా పదేళ్ల ప్రస్థానాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని హరీశ్ రావు అన్నారు. జిల్లా చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, అభివృద్ధి, సాధించిన విజయాలను ప్రతిబింబించేలా ప్రత్యేక సావనీర్ రూపొందించాలని సూచించారు. అలాగే నాటి సిద్దిపేట, నేటి సిద్దిపేట అనే అంశంపై సమగ్ర డాక్యుమెంటరీ రూపొందించాలని ప్రతిపాదించారు. జిల్లా ఏర్పాటుతో వచ్చిన మార్పులను యువతకు పరిచయం చేయడం అవసరమని పేర్కొన్నారు.

అక్టోబర్ 11న జిల్లా ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో ప్రత్యేక సభ నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. మూడు రోజుల పాటు వివిధ సాంస్కృతిక, సాహిత్య, సామాజిక కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. జర్నలిస్టులు, కవులు, రచయితలు, వైద్యులు, న్యాయవాదులు, వ్యాపారవేత్తల ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధి, సాధించిన ఫలితాలపై చర్చా వేదికలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మాజీ సూడా చైర్మన్ రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు గుండు భూపేష్‌తో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ, జర్నలిస్టు, రచయిత, వైద్య, న్యాయవాది, వ్యాపార, విశ్రాంత ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సిద్దిపేట పదేళ్ల పండుగను ప్రజల పండుగగా మార్చి జిల్లా ఘనతను దేశానికి చాటాలని సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు.

సకల జనుల సమ్మెపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

(మొదటి పేజీ తరువాయి)

సమ్మె ఉధృతంగా కొనసాగుతున్న సమయంలో భారీ సంఖ్యలో అరెస్టులు, లాఠీచార్జీలు, బాష్పవాయువు ప్రయోగం, అత్యవసర సేవల నిర్వహణ చట్టం అమలు వంటి చర్యలు ప్రజాస్వామ్య హక్కులకు విరుద్ధంగా ఉన్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజాసంఘాల ప్రతినిధులపై తీసుకున్న చర్యలు మానవ హక్కుల ఉల్లంఘనలకు దారితీశాయని ఆరోపించారు.

ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు తెలిపే హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, అలాంటి పరిస్థితుల్లో నిరసనకారులపై కఠిన చర్యలు చేపట్టడం అందోళనకరమని నాయకులు పేర్కొన్నారు. ఈ అంశంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ సహాధ్యక్షుడు, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్‌తో పాటు జేఏసీ నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, న్యాయవాదుల సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో చోటుచేసుకున్న పరిణామాలను కమిషన్‌కు వివరించారు.

సమ్మె సమయంలో జరిగిన పరిణామాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ చరిత్రలో సకల జనుల సమ్మె ఒక ముఖ్యమైన అధ్యాయమని, ఆ సమయంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు సంబంధించిన అంశాలను వెలుగులోకి తీసుకురావడం అవసరమని నాయకులు అభిప్రాయపడ్డారు.



సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు

- పంటలను కాపాడేందుకు చివరి తడికి నీటి విడుదల్నమంత్రి తుమ్మల వెల్లడి
- లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములకు విద్యుత్ సరఫరా
- రైతులు ఆందోళన చెందొద్దు..నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి
- సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ప్రత్యేక చర్యలు

భద్రాద్రి కొత్తగూడెం ,అక్టోబర్ 4 (భద్రాద్రిన్యూస్):
తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగర్ ఆయకట్టు పరిధిలో ఇప్పటికే సాగు చేసిన పంటలను కాపాడేందుకు చివరి తడికి నీటిని విడుదల చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతుల విజ్ఞప్తి మేరకు సీతారామ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను సాగర్ ఆయకట్టుకు విడుదల చేస్తున్నామని చెప్పారు. పంటలు ఎండిపోకుండా అవసరమైన నీటిని అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉన్నప్పటికీ రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని గోదావరి జలాలను విడుదల చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. సాగర్ ఆయకట్టుతోపాటు అశ్వారావుపేట, కొత్తగూడెం, పినపాక, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాలకు కూడా అదనంగా నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ఆయకట్టు, ప్రాజెక్టులకు నీరు..
పినపాక నియోజకవర్గంలోని తుమ్మల చెరువు ఆయకట్టుకు, అలాగే వైరా ప్రాజెక్టు, వెంగళరాయసాగర్ ప్రాజెక్టు, సింగభూపాలెం ప్రాజెక్టు, లంకాసాగర్ ప్రాజెక్టులకు కూడా గోదావరి జలాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ఆయా ప్రాజెక్టులు, చెరువుల పరిధిలోని ఆయకట్టుకు నీరు అందించి సాగు చేసిన పంటలను కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

లిఫ్టులకు విద్యుత్ సరఫరా..
పంటలను కాపాడుకునేందుకు అందుబాటులో ఉన్న అన్ని నీటి వనరులను వినియోగించుకుంటున్నామని తుమ్మల తెలిపారు. లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములకు కూడా విద్యుత్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. లిఫ్టుల ద్వారా అందుబాటులో ఉన్న నీటిని పొలాలకు అందించి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సీఎం ఆదేశాలతో ప్రత్యేక చర్యలు..
తీవ్ర వర్షాభావ పరిస్థితులు, నీటి లభ్యతలో ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగు చేసిన పంటలను కాపాడేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నీటిని విడుదల చేస్తున్నట్లు మంత్రి తుమ్మల తెలిపారు. రైతాంగం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పంటల పరిరక్షణకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

నీటిని వృథా చేయొద్దు...
ప్రస్తుతం అందుబాటులో ఉన్న గోదావరి జలాలను రైతులు పొదుపుగా వినియోగించుకోవాలని తుమ్మల సూచించారు. నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకుంటే మరింత విస్తీర్ణంలోని పంటలను కాపాడేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. తీవ్ర


ఫైల్ ఫోటో





వర్షాభావ పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న ప్రతి నీటి వనరును సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాగర్ ఆయకట్టు పరిధిలో ఇప్పటికే వేసిన పంటలకు చివరి తడి అందించడమే లక్ష్యంగా నీటి విడుదల చేపట్టామని మంత్రి స్పష్టం చేశారు. సాగర్ ఆయకట్టుతోపాటు పినపాక నియోజకవర్గంలోని తుమ్మల చెరువు ఆయకట్టు, వైరా, వెంగలరాయ సాగర్, సింగభూపాలెం, లంకాసాగర్ ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టుకు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతుల పంటలను కాపాడేందుకు నీటి విడుదలతోపాటు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు విద్యుత్ సరఫరా చేసి అన్ని విధాలుగా సహకరిస్తామని తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

ఖమ్మం రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల్లో ఖమ్మం సర్వీస్ ఫ్రంట్ ప్యానెల్ ఘన విజయం

ఖమ్మం, అక్టోబర్ 4 (భద్రాద్రిన్యూస్): ఖమ్మం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలు అక్టోబర్ 4వ తేదీన ఖమ్మంలోని టిటిడిసి భవన్, ఇల్లందు క్రాస్ రోడ్ లో ఉత్సాహ భరిత వాతావరణంలో జరిగాయి. ఈ ఎన్నికల్లో ఖమ్మం సర్వీస్ ఫ్రంట్ ప్యానల్ ఘన విజయం సాధించింది.ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల్లో ఖమ్మం సర్వీస్ ఫ్రంట్‌కు చెందిన మొత్తం 15 మంది అభ్యర్థులు అత్యధిక ఓట్లతో విజయం సాధించి, రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ అత్యధిక ఓట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచారు. మొత్తం పోలైన ఓట్లలో 563 ఓట్లను సాధించి, పోటీ చేసిన మొత్తం 39 మంది అభ్యర్థుల్లో అత్యధిక ఓట్లు పొందిన అభ్యర్థిగా డా. కూరపాటి ప్రదీప్ కుమార్ నిలిచారు. ఈ సందర్భంగా గెలిచిన అభ్యర్థులు మాట్లాడుతూ, తమపై నమ్మకంతో ఓటు వేసి ఘన విజయం అందించిన ప్రతి ఒక్క రెడ్‌క్రాస్ సభ్యునికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం వారి వ్యక్తిగత విజయంగా కాకుండా, ప్రజాసేవ, మానవతా విలువలు మరియు రెడ్‌క్రాస్ సేవా స్ఫూర్తిపై సభ్యులు ఉంచిన విశ్వాసానికి ప్రతీకగా భావిస్తున్నామని అన్నారు. కొత్తగా ఎన్నికైన మేనేజింగ్ కమిటీ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తృతం చేస్తామని, ఆపదలో ఉన్నవారికి, పేదలకు, అనాథలకు, రక్త అవసరమున్న వారికి మరియు సమాజంలోని ప్రతి వర్గానికి మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. “ఈ విజయం మా బాధ్యతను మరింత పెంచింది. ఖమ్మం రెడ్‌క్రాస్‌ను మరింత ప్రజలకు చేరువ చేసి, సేవే లక్ష్యంగా ముందుకు తీసుకెళ్తాం” అని కే ఎస్ ఎఫ్ ప్యానెల్ సభ్యులు పేర్కొన్నారు.



రేగళ్ల సమస్యల పరిష్కారానికి మంత్రి పొంగులేటికి సర్పంచ్ పూర్ణ వినతి

- రైతులకు పట్టా హక్కులు.. పేదలందరికీ 100 శాతం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి
- జూ= నిధులతో అభివృద్ధి పనులు.. గిరిజన ప్రాంతాల్లో కమ్యూనిటీ హాళ్లు ఏర్పాటు చేయాలి

లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 4(భద్రాద్రిన్యూస్):-
లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల ప్రాంత సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని కోరుతూ రేగళ్ల పెద్దతండా గ్రామపంచాయతీ సర్పంచ్ లావుడ్య పూర్ణ తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆదివారం రేగళ్ల గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ సర్వసభ సమావేశం సందర్భంగా ఆమె పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవరగట్ల ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పూర్ణ మాట్లాడుతూ.. ఉమ్మడి రేగళ్ల గ్రామపంచాయతీ పరిధిలో నాలుగు దశాబ్దాలుగా భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్న గిరిజన, గిరిజనేతర రైతులకు ఇప్పటికీ పట్టా హక్కులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పట్టాలు లేకపోవడంతో ఎరువులు, ఇతర వ్యవసాయ అవసరాలు పొందడంలో సమస్యలు ఎదురవుతున్నాయని, దీనివల్ల పంటల సాగు, దిగుబడిపై ప్రభావం పడుతోందని వివరించారు. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న అర్హులైన రైతులందరికీ పట్టా హక్కులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు
గిరిజన తండాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించాల్సిన అవసరం ఉందని సర్పంచ్ పేర్కొన్నారు. ఉమ్మడి రేగళ్ల ప్రాంతాన్ని ప్రత్యేక ప్రాధాన్యతతో పరిగణించి అర్హులైన ప్రతి పేద కుటుంబానికి 100 శాతం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఇళ్లు మంజూరై నిర్మాణ పనులు ప్రారంభించిన కొందరు లబ్ధిదారులు అనారోగ్య కారణాలతో మృతి చెందారని, వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. అలాంటి కుటుంబాలకు పెండింగ్‌లో ఉన్న స్లాబ్ బిల్లులను నిబంధనల మేరకు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.

KTPS, నవభారత్ నుంచి CSR నిధులు కేటాయించాలి
రేగళ్ల ప్రాంతానికి సమీపంలో ఉన్న ఖూూ, నవభారత్ పరిశ్రమల జూ= నిధులతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు. మౌలిక వసతులు, విద్య, వైద్యం, తాగునీరు, ఇతర ప్రజా అవసరాలకు జూ= నిధులను వినియోగించేలా పరిశ్రమల యాజమాన్యాలతో చర్చించాలని విజ్ఞప్తి చేశారు.

గిరిజన ప్రాంతాల్లో కమ్యూనిటీ హాళ్లు ఏర్పాటు చేయాలి
ఐటీడీఏ భద్రాచలం ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతాల్లో కమ్యూనిటీ హాళ్లను ఏర్పాటు చేయాలని కోరారు. వివాహాలు, సమావేశాలు, ఇతర ప్రజా కార్యక్రమాలకు ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు.



భూమి ఇచ్చిన గిరిజన కుటుంబానికి ఉద్యోగం కల్పించాలి
కిన్నెరసాని కాల్వ నుంచి కొత్తగూడెం మున్సిపాలిటీకి మంచినీరు అందించే పథకంలో భాగంగా రేగళ్ల ప్రాంతానికి చెందిన ఓ గిరిజన రైతు తనకు చెందిన 20 కుంటల భూమిని పైప్‌లైన్, సంబంధిత పనుల కోసం ఇచ్చారని సర్పంచ్ తెలిపారు. ఆ కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పించి అనంతరం రెగ్యులర్ చేస్తామని గతంలో హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు కాలేదన్నారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మంత్రిని కోరారు. సర్పంచ్ అందించిన వినతులపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. సమస్యలను పరిశీలించి నిబంధనల ప్రకారం అర్హులకు తగిన అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ లావుడ్య పూర్ణ మాట్లాడుతూ.. “రేగళ్ల ప్రాంత ప్రజల సమస్యలను మంత్రి సీనన్న దృష్టికి తీసుకెళ్లడం మా బాధ్యత. రైతులు, పేదలు, గిరిజన కుటుంబాలకు న్యాయం జరిగే వరకు ప్రజల తరఫున నిరంతరం కృషి చేస్తాం” అని తెలిపారు.

శ్రీ టౌన్ ఎస్‌హెచ్‌ఓ చిట్టిబాబుకు ఘన సన్మానం

- మర్యాదపూర్వకంగా కలసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసిన నాయకులు



ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 4 (భద్రాద్రిన్యూస్): ఖమ్మం శ్రీ టౌన్ పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) చిట్టిబాబును పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో 36వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామమోహన్ రావు, టీఆర్ఎస్ పార్టీ నాయకులు కనకం భద్రయ్య, ముక్కాల రాజేష్, బండి నవీన్, గుంటుపల్లి దివాకర్ గుప్తా, వెంపటి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పక్షవాత బాధితుడికి మున్నూరు కాపు జేఏసీ ఆర్థిక సాయం

- అపదలో ఉన్న వారికి అండగా నిలుస్తాం.. సమాజ సేవలో ముందుంటాం
- సంఘాన్ని ఏకతాటిపైకి తీసుకురావడమే లక్ష్యం : జేఏసీ నేతలు



ఖమ్మం ప్రతినిధి , అక్టోబర్ 4 (భద్రాద్రిన్యూస్): ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలనే లక్ష్యంతో మున్నూరు కాపు జేఏసీ ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం 34వ డివిజన్‌లో ఆర్థిక సహాయం అందజేశారు. రంగనాయకులగుట్టకు చెందిన శీలం సాలయ్య గత మూడేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మున్నూరు కాపు సంఘం నాయకులు వెంటనే స్పందించి జేఏసీ తరఫున ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న కుటుంబాలకు తమ వంతు సహకారం అందించడం సంఘం బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందేలా మున్నూరు కాపు జేఏసీ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఆర్థిక సహాయం అందుకున్న శీలం సాలయ్య జేఏసీ నాయకులు, కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమాజ సేవా కార్యక్రమాల్లో సంఘం మరింత చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. మున్నూరు కాపు సంఘాన్ని ఏకతాటిపై నిలబెట్టి, ఐక్యతతో ముందుకు తీసుకెళ్లడమే తమ ప్రధాన లక్ష్యమని జేఏసీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు జేఏసీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఎర్ర అప్పారావు, యూనియన్ బాధ్యులు మాడూరి సైదారావు, రాపర్తి రాజా, మాటేటి రవి, నరాల రమేష్, మోహన్, బండి నవీన్, శీలం నాగేశ్వరరావు, అండెం అరుణ్, చిన్న మధు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. మరిపెడ వాసి మృతి..??



అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా మరిపెడకు చెందిన దారం సుప్రజ మృతి చెందారు. సెయింట్ లూయిస్‌లో రెస్టారెంట్ నిర్వహిస్తున్న ఆమె, రాత్రి రెస్టారెంట్ మూసివేసి స్నేహితురాలితో కారులో ఇంటికి బయలుదేరారు. కొద్దిసేపటికే కారును ట్రక్ ఢీకొనడంతో సుప్రియ(31) అక్కడికక్కడే మృతి చెందగా, స్నేహితురాలికి తీవ్ర గాయాలయ్యాయి. సుప్రియకు భర్త, కుమారుడు ఉన్నారు.

భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో మూడో యూనిట్ నిలిచిపోవడం ప్రభుత్వ వైఫల్యమే

- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్
- విద్యుత్ ప్లాంట్ల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



ఖమ్మం ప్రతినిధి ,అక్టోబర్ 4 (భద్రాద్రిన్యూస్):-
భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోని మూడో యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడంపై మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న సమయంలో కీలకమైన యూనిట్ నిలిచిపోవడం ప్రభుత్వ విద్యుత్ నిర్వహణలో నిర్లక్ష్యానికి, వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ యూనిట్ నిలిచిపోవడంతో రోజుకు 270 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలిగిందని ఇప్పటివరకు సుమారు 15.5 కోట్ల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం కలిగిందని మాజీ మంత్రి పువ్వాడ ఆందోళన వ్యక్తంచేశారు. విద్యుత్ ఉత్పత్తి సంస్థల్లో కీలకమైన పరికరాల నిర్వహణ, ముందస్తు తనిఖీలు, స్పేర్ పార్ట్స్ అందుబాటులో ఉంచడంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహించిందో సమాధానం చెప్పాలని పువ్వాడ డిమాండ్ చేశారు. నిలిచిపోయిన మూడో యూనిట్‌ను వెంటనే పునరుద్ధరించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటో వెల్లడించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రశ్నించారు.

భద్రాద్రి న్యూస్
www.bhadradrinews.com
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
Follow :
@bhadradrinews
సోమవారం
5 । అక్టోబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం,
భద్రాద్రి కొత్తగూడెం

పోడు.. భూ సమస్యలకు త్వరలో పరిష్కారం

- ఏజెన్సీలో ప్రతి గ్రామంలోని భూ సమస్యలను పరిష్కరిస్తాం : మంత్రి పొంగులేటి

- ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం.. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి

లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 4 (భద్రాద్రిన్యూస్):
ఏజెన్సీ ప్రాంతాల్లో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న పోడు భూములు, ఇతర భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల గ్రామంలో ఆదివారం నిర్వహించిన మండల కాంగ్రెస్ పార్టీ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సుమారు 2 వేల మందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రతి గ్రామంలో ఉన్న పోడు సమస్యతో పాటు అన్ని రకాల భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అర్హులైన ప్రజలకు న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యతనిస్తూ అన్ని వర్గాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్, ధాన్యానికి బోనస్, ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు, విద్య, వైద్యం తదితర సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందిస్తున్నామని వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి ఆరోపించారు. ఎన్ని కుట్రలు ఎదురైనా ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తామని, ప్రజల గుండెల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సుస్థిర స్థానం సంపాదించుకుంటుందని అన్నారు.







గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై దృష్టి
త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం, మండలం, జిల్లా కేంద్రంలో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఎన్నికల వ్యవస్థపై కూడా మంత్రి పలు విమర్శలు చేశారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ పేరుతో కోట్లాది మంది ఓట్లను తొలగించి అధికారం కోసం కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కొత్తగూడెం నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఏ శక్తి అడ్డుకోలేదని మంత్రి స్పష్టం చేశారు. మహిళలు, రైతులు, పేదలు, గిరిజనులు సహా అన్ని వర్గాలకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, మంత్రి పొంగులేటి ఉమ్మడి జిల్లా క్యాంపు ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కోనేరు సత్యనారాయణ, ఆళ్ల మురళి, ఊకంటి గోపాలరావు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జేవీఎస్ చౌదరి, ఏనుగుల అర్జున్‌రావు, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితాకుమారి, సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంతరావు, డీసీసీ అధికార ప్రతినిధి వై. శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శులు ఎం. పెద్దబాబు, లోశెట్టి నాగార్జున, రాజేంద్రప్రసాద్, మంగయ్యదొర, జిల్లా ఉపాధ్యక్షులు మంద హనుమంతు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల అధ్యక్షులు దేవరగట్ల ప్రసాద్, భువన సుందర్‌రెడ్డి, నర్రా అజయ్‌కుమార్, పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు, కవడగాని పరమేష్‌యాదవ్, పీతాంబరం, సత్యనారాయణరెడ్డి, పూనెం శ్రీనివాస్, రెడ్డెం సతీష్‌కుమార్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ బత్తుల వీరయ్య, రామకోటి, బొల్లం రామయ్య, పారపత్తి భద్రయ్య, ప్రసాద్, వజ్రాజు తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పత్తి తూకాల్లో మోసాలపై రైతన్నలు అప్రమత్తం

- మల్లుపల్లిలో తూకం మోసంపై ఆరోపణలు..

సింగరేణి మండల రైతుల్లో ఆందోళన

కారేపల్లి, అక్టోబర్ 04 (భద్రాద్రి న్యూస్ రాములు):
పత్తి సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది. కొణిజర్ల మండలం మల్లుపల్లిలో పత్తి తూకం సమయంలో రిమోట్ పరికరం ద్వారా తూకంలో తేడాలు చూపిస్తున్నారనే ఆరోపణలు వెలుగులోకి రావడం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో సింగరేణి మండలంలోని పత్తి రైతులు పత్తి విక్రయాల సమయంలో తూకాల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

రిమోట్‌తో తూకంలో తేడాలా..?
పత్తి తూకం సమయంలో రిమోట్ పరికరాన్ని ఉపయోగించి తూకం యంత్రంలో మార్పులు చేస్తున్నారనే ఆరోపణలు మల్లుపల్లిలో చర్చనీయాంశంగా మారాయి. రైతులు ఎంతో శ్రమించి పండించిన పత్తిలో తూకం విషయంలో స్వల్ప తేడా వచ్చినా విక్రయ సమయంలో ఆర్థికంగా నష్టం వాటిల్లే అవకాశం ఉంది. సీజన్ ప్రారంభంలోనే ఇలాంటి ఆరోపణలు రావడంతో తూనికలు--కొలతల శాఖ అధికారులు గ్రామీణ ప్రాంతాల్లోని తూకం కేంద్రాలను తనిఖీ చేయాలని రైతులు కోరుతున్నారు.

సింగరేణి రైతులు అప్రమత్తంగా ఉండాలి
పత్తిని విక్రయించే సమయంలో వీలైనంత వరకు అధికారిక ధర్మకాటా వద్ద తూకం వేయించి రసీదు తీసుకోవాలని రైతులకు సూచిస్తున్నారు. ప్రైవేట్ కాటాల వద్ద తూకం వేయించినప్పుడు రైతులు స్వయంగా తూకం ప్రక్రియను పరిశీలించాలి. తూకంపై అనుమానం కలిగితే వెంటనే మరో కాటా వద్ద తూకం వేయించి సరిపోల్చుకోవాలని సూచిస్తున్నారు.

రైతులు పాటించాల్సిన జాగ్రత్తలు
- తూకం వేయించే ముందు కాటా సున్నాగా ఉందో పరిశీలించాలి.
- వీలైనంత వరకు అధికారిక ధర్మకాటా వద్ద తూకం వేయించుకోవాలి.



- తూకం పూర్తయిన అనంతరం తప్పనిసరిగా రసీదు తీసుకోవాలి.
- తూకంపై అనుమానం ఉంటే మరో కాటా వద్ద క్రాస్‌చెక్ చేసుకోవాలి.
- అనుమానాస్పద పరికరాలు లేదా తూకంలో తేడా గుర్తిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలి.

ప్రైవేట్ కాటాలపై అధికారుల తనిఖీలు అవసరం : పత్తి సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని సింగరేణి మండలంతో పాటు పరిసర గ్రామాల్లోని ప్రైవేట్ కాటాలను తూనికలు--కొలతల శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేయాలని రైతులు కోరుతున్నారు. తూకం యంత్రాల్లో అక్రమ పరికరాలు ఉపయోగిస్తున్నట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రైతన్న చెమటకు తూకమే న్యాయం.. తూకంలో తేడా వస్తే శ్రమకు నష్టం! పత్తి విక్రయాల సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండి, అనుమానం కలిగిన వెంటనే సంబంధిత అధికారులను ఆశ్రయిస్తే తూకం మోసాలకు అడ్డుకట్ట వేయవచ్చని రైతులు పేర్కొంటున్నారు.



నియోజకవర్గాలను సస్యశ్యామలం చేస్తాం

- పంపింగ్ లిఫ్ట్ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, భూక్య మురళీ నాయక్

కారేపల్లి, అక్టోబర్ 4 (భద్రాద్రి న్యూస్ రాములు): సీతారామ ప్రాజెక్టు జలాలతో ఇల్లందు, మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలకు సాగు, తాగునీరు అందించి ఆయా ప్రాంతాలను సస్యశ్యామలం చేయడమే లక్ష్యమని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ అన్నారు. సీతారామ ప్రాజెక్టులో భాగంగా కారేపల్లి మండలం చీమలపాడు (పాపకొల్లు గండ్ల) సరిహద్దుల్లో ఏర్పాటు చేయనున్న పంపింగ్ లిఫ్ట్ స్థలాన్ని శనివారం ఎమ్మెల్యేలు కాలినడకన వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి ప్రాజెక్టు మ్యాప్‌ను పరిశీలించి, నీటి ప్రవాహ మార్గాలు, పంపింగ్ లిఫ్ట్ ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

త్వరలో పనులు ప్రారంభించేలా చర్యలు
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుల దృష్టికి ప్రాజెక్టు అంశాన్ని తీసుకెళ్లి, త్వరితగతిన నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేలు తెలిపారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.



దశాబ్దాల కలను సాకారం చేస్తాం
కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో సీతారామ జలాలను ఆయా ప్రాంతాలకు తీసుకువచ్చి మూడు నియోజకవర్గాల ప్రజల దశాబ్దాల కలను సాకారం చేస్తామని ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. ప్రాజెక్టు పనులు వేగవంతం చేసి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో చీమలపాడు సర్పంచ్ మాలోత్ లలిత బావుసింగ్, ఉపసర్పంచ్ స్వాతి, మహబూబాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి రమేష్, బయ్యారం మాజీ సొసైటీ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకుడు తోటకూరి శివయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గబ్రు నాయక్, వెల్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ టి యు నూతన కమిటీ ఎన్నిక

- ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా కట్టా శేఖర్ రావు ,

ప్రధాన కార్యదర్శిగా ఆర్. రంగారావు

ఖమ్మం ప్రతినిధి ,అక్టోబర్ 4 (భద్రాద్రిన్యూస్):
పిఆర్టియు ఖమ్మం జిల్లా నూతన కార్యవర్గాన్ని రాబోయే రెండేళ్ల కాలానికి ఏకగ్రీవంగా ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా కట్టా శేఖర్ రావు , ప్రధాన కార్యదర్శిగా ఆర్.రంగారావు లను ఎన్నుకున్నారు . పిఆర్టియు సంఘ కార్యాలయంలో జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఈ ఎన్నికలు నిర్వహించారు . సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు టీ. జితేందర్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి టీ. నరేష్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు . అసోసియేట్ అధ్యక్షులుగా జి. విజయ్ , అమృత్ కుమార్ , ఆర్. బ్రహ్మారెడ్డి , మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా జి. సుజాత ఉపాధ్యక్షులుగా టీ. రత్నకుమార్ , ఏ.సోమ్లా , బోబోలు శ్రీనివాసరావు , కొమ్ము శ్రీనివాసరావు , డి. రవికుమార్ , కార్యదర్శులుగా బి. కమలాకర్ రెడ్డి , తాల్లూరి చంద్రశేఖర్ , బి. రాములు , కె. దయాకర్ లు ఎన్నికయ్యారు . ఈ కార్యక్రమంలో అన్ని మండలాల అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు , రాష్ట్ర , జిల్లా , మండల కార్యవర్గ సభ్యులు మరియు పిఆర్టియు కార్యకర్తలు పాల్గొన్నారు .



ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ భద్రాద్రి జిల్లా నూతన కార్యవర్గం..

- జిల్లా అధ్యక్షుడిగా బండి లక్ష్మణ్.



పాల్వంచ ,అక్టోబర్ 04(భద్రాద్రి న్యూస్): ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ జాతీయ ఉపాధ్యక్షులు కాల్వ భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో భద్రాద్రి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఆదివారం నియమించారు. నూతన కార్యవర్గంలో జిల్లా అధ్యక్షుడిగా బండి లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొత్తపల్లి సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా గజ్జి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా వాసుమల్ల సుందర్రావు, బండి నాగరాజు, బిల్లా సృజిత్, కార్యదర్శులుగా బండి నాగేశ్వరరావు, బండి రామచందర్, ఇస్సపల్లి నాగరాజు, కోశాధికారిగా వలమల్ల బాబురావులను నియమించారు. ఈ కార్యక్రమానికి పట్టణ అధ్యక్షులు కాల్వ ప్రకాష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి జాతీయ ఉపాధ్యక్షులు కాల్వ భాస్కరరావు మాట్లాడుతూ సమాజంలో దళితులపై జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కొని, వారి హక్కులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని, సామాజిక సమానత్వం, న్యాయం కోసం నిరంతరం పోరాడాలని ఉద్బోధించారు. నూతన కార్యవర్గం భద్రాద్రి జిల్లాలో ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు, సామాజిక న్యాయ సాధనకు కృషి చేస్తుందని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు.

పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కందాళ



నేలకొండపల్లి, అక్టోబర్ 04 (భద్రాద్రి న్యూస్) : నేలకొండపల్లి మండలం అప్పల నరసింహపురం గ్రామంలో రైతు కుటుంబం.. విషాద ఘటనపై మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి గారు వారి కుటుంబాన్ని పరామర్శించారు, అనంతరం మంగాపురంలో ఇటీవలే మరణించిన మాజీ ఉపసర్పంచ్ తేజావత్ ధర్మా గారి తల్లి గారు. కీ,శే, నాజి, బోదులబంద గ్రామంలో కీ,శే,తక్కళ్ళపల్లి వెంకటేశ్వర్లు, గువ్వల గూడెం గ్రామంలో మాతంగి వెంకయ్య గారు, ఇటీవల అనారోగ్యంతో మరణించిన వారి చిత్రపటాలకి పూలమాలు వేసి నివాళులు అర్పించారు వారి కుటుంబం సభ్యులకి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల పార్టీ నాయకులు గ్రామ నాయకులు యూత్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



పట్టభద్రులంతా ఓటు నమోదు చేసుకోవాలి

- నవంబర్ 6లోపు నమోదు పూర్తి చేయాలి

- బీఆర్ఎస్ మండల నాయకుడు గడ్డం వీరన్న

గుండాల, అక్టోబర్ 04 (భద్రాద్రి న్యూస్) : గుండాల మండల పరిధిలోని పట్టభద్రులందరూ నవంబర్ 6వ తేదీలోపు తమ ఓటును నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ మండల నాయకుడు గడ్డం వీరన్న కోరారు.ఖమ్మం--నల్గొండ--వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గానికి 2027లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం గత నెల 28వ తేదీ నుంచి ప్రారంభమైనట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.గతంలో పట్టభద్రుల ఓటు వేసిన వారు కూడా మరోసారి ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించేందుకు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ముఖ్యమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటు హక్కు కీలకమని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.ఓటరు నమోదు, ఇతర వివరాల కోసం 9550104056 నంబర్‌ను సంప్రదించాలని గడ్డం వీరన్న సూచించారు.



పామేడు పోలీసుల వసూళ్లపై ఆటో కార్మికుల ఆగ్రహం!

– తెలంగాణ ఆటోలను టార్గెట్ చేస్తున్నారంటూ ఆరోపణలు.. రూ.1,000 నుంచి రూ.3,000 వరకు డిమాండ్ చేస్తున్నారని ఆవేదన.. బీజాపూర్ ఎస్పీ జోక్యం చేసుకోవాలని డిమాండ్



చర్ల, అక్టోబర్ 4 (భద్రాద్రి న్యూస్): తెలంగాణ నుంచి ఛత్తీస్‌గఢ్‌కు రాకపోకలు సాగించే ఆటో కార్మికులు ఛత్తీస్‌గఢ్ పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ వాహనాలను పామేడు పోలీసులు లక్ష్యంగా చేసుకుని అక్రమంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపిస్తూ తిప్పాపురంలో ఆటో కార్మికులు ధర్నా నిర్వహించారు. పోలీసుల వేధింపులకు అడ్డుకట్ట వేయాలని, తెలంగాణ వాహనాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా అనుమతించాలని డిమాండ్ చేశారు.

ఆటో కార్మికుల ఆరోపణల ప్రకారం.. తెలంగాణ నుంచి ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లే ఆటోలను పామేడు పోలీసులు అడ్డుకుని ఒక్కో వాహనం నుంచి రూ.1,000 నుంచి రూ.3,000 వరకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. అడిగిన మొత్తం చెల్లించకపోతే వాహనాలను నిలిపివేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారీ జీవనోపాధి కోసం ఆటోలు నడుపుకుంటున్న తమపై ఈ తరహా ఒత్తిళ్లు తీవ్ర ఆర్థిక భారంగా మారుతున్నాయని పేర్కొన్నారు. 'రహదారిపై తిరగాలంటే వసూళ్లు చెల్లించాలా?' అంటూ ఆటో కార్మికులు ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం ప్రయాణించే వాహనాలను అడ్డుకోవడం సరికాదని, చట్టబద్ధంగా వ్యవహరించాల్సిన పోలీసులే తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ--ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో రాకపోకలు సాగించే చిన్న వాహనాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి వేధింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

బీజాపూర్ ఎస్పీ జోక్యం చేసుకోవాలి

పామేడు పోలీసులపై వస్తున్న ఆరోపణలపై బీజాపూర్ జిల్లా ఎస్పీ తక్షణమే జోక్యం చేసుకుని సమగ్ర విచారణ చేపట్టాలని ఆటో కార్మికులు డిమాండ్ చేశారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ వాహనదారులకు రక్షణ కల్పించి, ఎలాంటి అనధికారిక వసూళ్లకు తావులేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని ఆటో కార్మికులు హెచ్చరించారు. అవసరమైతే ఛత్తీస్‌గఢ్ వాహనాలను తెలంగాణలో అడ్డుకునే స్థాయికి పరిస్థితి దారితీస్తుందని స్పష్టం చేశారు. తమపై జరుగుతున్న వేధింపులకు తక్షణమే తెరదించాలని, ఇరు రాష్ట్రాల అధికార యంత్రాంగం స్పందించి ఆటో కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరారు.

జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని మంత్రి పొంగులేటికి వినతి

– త్వరలో ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తా
– మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



లక్ష్మీదేవిపల్లి ,అక్టోబర్ 4 (భద్రాద్రిన్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి మండలాల్లో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి జర్నలిస్టులు వినతిపత్రం అందచేశారు. ఆదివారం జిల్లా పర్యటనకు వచ్చిన పొంగులేటిని లక్ష్మీదేవి పల్లి మండలంలోని రేగళ్లలో జరిగిన సమావేశంలో జర్నలిస్టులు కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ఎన్నో సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపిన జర్నలిస్టులు సొంత ఇళ్లు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇళ్ల స్థలాల కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నామని చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో జర్నలిస్టులకు ఇచ్చిన హామీ మేరకు ఇళ్లజిస్థలాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. గతంలో జిల్లా కేంద్రంలో జర్నలిస్టుల ఇళ్లస్థలాల నిమిత్తం రామవరం వంతెన సమీపంలో 10 ఎకరాల స్థలాన్ని కేటాయించడం జరిగిందని, కొన్ని అనివార్య కారణాలతో స్థలాల కేటాయింపు మధ్యలోనే నిలిచిపోయిందని అన్నారు. త్వరితగతిన అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో ఇళ్లస్థలాల సమస్యను పరిష్కరిస్తా.జర్నలిస్టులో ఇళ్లస్థలాల సమస్య నా దృష్టిలో ఉందని ఈ సమస్యను త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంత్రి పొంగులేటిని కలిసిన వారిలో ఇళ్ల స్థలాల సాధన కమిటీ సభ్యులు జర్నలిస్టులు కల్లోజి శ్రీనివాస్, వీరు నాయక్,నాగచంద్ర. వట్టికొండ రవి, తారక్, పాపారావు. రాజేష్. జర్నలిస్టులు. నరసింహారావు.అశోక్. పురుషోత్తం. ఈశ్వర్.శ్యామ్.లింగయ్య. నరేష్ తదితరులు పాల్గొన్నారు

రోళ్లగడ్డ గ్రామ పంచాయతీలో మద్యం నిషేధం కోసం ప్రతిపాదన సర్పంచ్ బూక్య మంగమ్మ



గుండాల అక్టోబర్ 4 భద్రాద్రి న్యూస్ : రోళ్లగడ్డ గ్రామ పంచాయతీ పరిధిలో మద్యపానాన్ని నిషేధించడం కోసం వివిధ గ్రామాల పెద్దలు వారి సమ్మితి తెలిపారు. గ్రామ పంచాయతీ ప్రజల అభిప్రాయం కోరుతూ ప్రతిపాదన, రోళ్లగడ్డ గ్రామ ప్రజల ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, యువత భవిష్యత్తు మరియు గ్రామంలో ప్రశాంతమైన వాతావరణాన్ని కాపాడే ఉద్దేశంతో గ్రామ పంచాయతీ పరిధిలో మద్యపానాన్ని నిషేధించేందుకు ఈ ప్రతిపాదనను గ్రామ పంచాయతీ ప్రజల ముందుకు తీసుకువస్తున్నాము.

మద్యం వల్ల కలిగే ప్రధాన నష్టాలు

ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం:అధిక మద్యపానం వల్ల కాలేయం, గుండె, మెదడు తదితర అవయవాలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. కుటుంబ ఆర్థిక పరిస్థితి దెబ్బతినడం:లి సంపాదించిన డబ్బులో కొంత భాగం మద్యానికి ఖర్చు కావడంతో కుటుంబ అవసరాలకు డబ్బు కొరత ఏర్పడుతుంది. కుటుంబ కలహాలు: మద్యపానం వల్ల భార్యాభర్తల మధ్య, కుటుంబ సభ్యుల మధ్య గొడవలు మరియు వివాదాలు పెరిగే అవకాశం ఉంది. యువతపై ప్రభావం: యువత మద్యానికి అలవాటు పడితే వారి విద్య, ఉద్యోగం మరియు భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ప్రమాదాల పెరుగుదల: మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరగడం.

నేరాలు మరియు శాంతిభద్రతల సమస్యలు: మద్యం మత్తులో గొడవలు, హింసాత్మక ఘటనలు మరియు ఇతర సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. పిల్లలపై ప్రతికూల ప్రభావం: కుటుంబంలో మద్యపానం కారణంగా పిల్లల చదువు, మానసిక ప్రశాంతత మరియు భవిష్యత్తుపై ప్రభావం పడవచ్చు.

సామాజిక సమస్యలు: మద్యపానం వల్ల గ్రామంలో సామాజిక అసమానతలు, గొడవలు మరియు ప్రజా శాంతికి భంగం కలిగే పరిస్థితులు ఏర్పడవచ్చు. అందువల్ల రోళ్లగడ్డ గ్రామ పంచాయతీ పరిధిలో మద్యపానాన్ని నిషేధించడం కోసం సంబంధిత ప్రభుత్వ అధికారులకు గ్రామ పంచాయతీ తరఫున ప్రతిపాదన పంపించాలని గ్రామ ప్రజల ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, మహిళల భద్రత, యువత భవిష్యత్తు మరియు గ్రామ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మద్యపాన నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరుటకు పంచాయతీ లోని ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయలని కోరుతున్నాము.

త్వరలోనే గ్రామ సభ లో తీర్మానం చేయుటకు అందరు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించిన ఆలయ కమిటీ



వైరా, అక్టోబర్ 4,(భద్రాద్రి న్యూస్) : వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ రెండో వార్డు హనుమాన్ బజార్లో శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవాలయం నందు శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవ పోస్టర్ ను జై వాసవి ఫౌండేషన్ అధినేత కుంచపు రాంబాబు, ఆలయ కమిటీ చైర్మన్ వేముల నాగరాజు, కమిటీ సభ్యులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుండి 21వ తేదీ వరకు దేవీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఉత్సవాలతో పాటు బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు పల్లపు కొండలరావు, ఓర్సు శ్రీను, వేముల కుమార్, బండారు నాగరాజు, ఉప్పు పుల్లయ్య, దేవల శ్రీరామ్, ఓర్సు రామకృష్ణ, త్వరగా చిన్న రాములు, వేముల బాలయ్య, వల్లెపు ఏడుకొండలు, వల్లెపు రాము, పల్లపు సతీష్, ఓర్సు గోపి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు

వాసన వస్తున్న చికెన్.. విద్యార్థుల ఆందోళన!

- హాస్టల్ భోజనంపై తీవ్ర ఆరోపణలు..
- నాణ్యత లేని చికెన్ వడ్డించారంటూ విద్యార్థుల ఆవేదన..
- ఆరోగ్యంతో చెలగాటం ఆడొద్దంటూ డిమాండ్..
- వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్న విద్యార్థులు



చర్ల, అక్టోబర్ 4 (భద్రాద్రి న్యూస్):

ఎంపీహెచ్ బాయ్స్ హాస్టల్‌లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతపై మరోసారి ప్రశ్నలు తలెత్తాయి. చర్లలోని ఎంపీహెచ్ బాయ్స్ హాస్టల్‌లో చికెన్ భోజనం విషయంలో విద్యార్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. చికెన్ నుంచి వాసన వస్తోందని, భోజనం నాణ్యతపై అనుమానాలు ఉన్నాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిసింది. విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన అంశంలో ఇలాంటి ఫిర్యాదులు రావడం పట్ల తల్లిదండ్రులు, విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది.

విద్యార్థుల ఆరోగ్యంతో ఆటలొద్దు!

హాస్టల్‌లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం అందించే భోజనం కేవలం ఆకలి తీర్చడానికి మాత్రమే కాకుండా, వారి ఆరోగ్యం, చదువు, భవిష్యత్తుతో ముడిపడి ఉంటుంది. అలాంటి భోజనంలో నాణ్యతపై అనుమానాలు వ్యక్తమైతే సంబంధిత అధికారులు వెంటనే స్పందించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా మాంసాహారంలో నాణ్యత, తాజాదనం, వంట విధానం, నిల్వ వంటి అంశాల్లో ఏమాత్రం నిర్లక్ష్యం జరిగినా విద్యార్థుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. చికెన్ వాసన వస్తోందని విద్యార్థులు చెబుతున్న సమయంలో వారి ఫిర్యాదులను తేలికగా తీసుకోవడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. భోజనం నాణ్యతపై విద్యార్థులు ప్రశ్నిస్తే వారిని సముదాయించడం కాకుండా.. అసలు సమస్య ఏమిటో తెలుసుకునేలా అధికారులు తక్షణమే తనిఖీ చేయాలని డిమాండ్ వినిపిస్తోంది.

మధ్యాహ్నం వండిన భోజనమేనా? సాయంత్రానికి వడ్డించారా?

విద్యార్థుల ఆరోపణల ప్రకారం చికెన్ భోజనం విషయంలో వంట, నిల్వ, వడ్డింపు విధానంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మధ్యాహ్నం వండిన ఆహారాన్ని సాయంత్రం వరకు నిల్వ చేసి వడ్డించారా? సరైన ఉష్ణోగ్రతలో భద్రపరిచారా? చికెన్ నాణ్యతను ముందుగానే పరిశీలించారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ఈ అంశాలపై అధికారికంగా పూర్తి విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాల్సి ఉంది. విద్యార్థుల ఆరోపణలు నిజమా? లేక భోజనం నాణ్యతపై ఏర్పడిన అపోహలా? అన్నది సంబంధిత అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

పర్యవేక్షణ ఎక్కడ?

ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు అందించే భోజనంపై సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. వంటగది పరిశుభ్రత, సరుకుల నాణ్యత, ఆహార పదార్థాల నిల్వ, వంట సమయం, భోజనం వడ్డించే విధానం తదితర అంశాలను పరిశీలించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కానీ విద్యార్థుల నుంచి భోజన నాణ్యతపై ఫిర్యాదులు వస్తున్నాయంటే క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఏ మేరకు జరుగుతోందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేస్తేనే వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

విద్యార్థుల ఫిర్యాదులను పట్టించుకోవాలి

హాస్టల్‌లో ఉండే విద్యార్థులు తమ భోజనంపై ఫిర్యాదు చేయడం వెనుక కారణాలను అధికారులు తెలుసుకోవాలి. వారికి సచ్చలేదనే కారణంతో ఫిర్యాదులను పక్కన పెట్టకుండా.. ఆహార నమూనాలను పరిశీలించి, అవసరమైతే సంబంధిత అధికారిక ల్యాబ్‌కు పంపించి నాణ్యతను నిర్ధారించాలి. విద్యార్థులు చదువుకోవడానికి హాస్టల్‌లో ఉంటారు. ప్రభుత్వ నిధులతో వారికి భోజనం అందిస్తున్నప్పుడు ప్రతి రూపాయి ప్రజాధనం అనే విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలి. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం బాధ్యతగా తీసుకోవాలి తప్ప, ఏదైనా లోపం బయటపడిన తర్వాతే స్పందించే పరిస్థితి ఉండకూడదని పలువురు కోరుతున్నారు.

వెంటనే విచారణకు ఆదేశించాలి

చికెన్ భోజనంపై విద్యార్థులు వ్యక్తం చేసిన అభ్యంతరాలపై సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే విచారణకు ఆదేశించాలని డిమాండ్ వ్యక్తమవుతోంది. హాస్టల్‌లోని వంటగది, ఆహార పదార్థాల నిల్వ, చికెన్ కొనుగోలు చేసిన విధానం, వంట సమయం, వడ్డింపు వరకు మొత్తం ప్రక్రియను పరిశీలించాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా భోజనం నాణ్యతలో లోపాలు ఉన్నట్లు విచారణలో తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఫిర్యాదులు పునరావృతం కాకుండా హాస్టల్‌లో క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థుల ఆరోగ్యమే ప్రథమ ప్రాధాన్యత

హాస్టల్ విద్యార్థుల అధికారుల దయపై ఆధారపడేవారు కాదు.. ప్రభుత్వ పథకాల ద్వారా తమకు లభించాల్సిన సౌకర్యాలు, నాణ్యమైన భోజనం పొందే హక్కు వారికి ఉంది. భోజనం నాణ్యతపై ప్రశ్నలు తలెత్తినప్పుడు వారి గొంతును వినడం అధికారుల బాధ్యత. చికెన్ నాణ్యతపై వచ్చిన ఆరోపణలు నిజమా? కాదా? అనే విషయాన్ని అధికారులు పారదర్శకంగా వెల్లడించాలి. విద్యార్థుల ఆరోగ్యానికి ఏమాత్రం ముప్పు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలి. హాస్టల్ భోజనంలో నిర్లక్ష్యానికి చెక్ పెట్టి, విద్యార్థులకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



కోదాడ క్రికెట్ అకాడమీ క్రీడాకారిణి వర్షిణికి అరుదైన గౌరవం: ఉమ్మడి నల్గొండ జిల్లా అండర్-17 జట్టుకు ఎంపిక





కోదాడ, అక్టోబర్ 04(భద్రాద్రి న్యూస్):

కోదాడ పట్టణానికి చెందిన క్రికెట్ క్రీడాకారిణి సోపంగు వర్షిణి అరుదైన మైలురాయిని అందుకుంది. అండర్-17 బాలికల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలలో పాల్గొనే ఉమ్మడి నల్గొండ జిల్లా జట్టుకు ఆమె ఎంపికైంది. ఇటీవల మిర్యాలగూడలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో (సెలక్షన్స్) వర్షిణి అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకుంది. గుడిబండకు చెందిన వర్షిణి, ప్రస్తుతం కోదాడ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతోంది. తన అసాధారణ బౌలింగ్ ప్రతిభతో జిల్లా జట్టులో స్థానం సంపాదించుకుని కోదాడ కీర్తిని చాటింది.

ఈ నెల 10వ తేదీ నుండి 13వ తేదీ వరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరగబోయే ప్రతిష్టాత్మక రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో ఉమ్మడి నల్గొండ జిల్లా తరఫున వర్షిణి ప్రాతినిధ్యం వహించనుంది. వర్షిణి సాధించిన ఈ విజయం పట్ల కోదాడ క్రికెట్ అకాడమీ కోచ్ షేక్ అబూబకర్ సిద్ధిఖ్ తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఆమె రాష్ట్రస్థాయిలో కూడా రాణించి మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అకాడమీ ప్రతినిధులు, క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

వార్డు సభ్యుల ఫోరం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నాగబండి సంతోష్

స్టేషన్ ఘనపూర్,అక్టోబర్ 4



తెలంగాణ రాష్ట్ర వార్డు మెంబర్స్ ఫోరం స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నాగబండి సంతోష్ నియమితులయ్యారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి మహేష్ ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టారు.

జనగామ జిల్లా వార్డు మెంబర్స్ ఫోరం ఇన్‌ఛార్జి గుండేటి రాంచందర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సంతోష్‌ను నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించారు. ఈ సందర్భంగా నాగబండి సంతోష్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన ఫోరం రాష్ట్ర, జిల్లా నాయకులతో పాటు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ బొల్లం అవినాష్, ఎస్టీ విభాగం జిల్లా నాయకులు భూక్యా ఎం.జి. నాయక్, స్టేషన్ ఘనపూర్ మండల ఇన్‌ఛార్జి గుండె లక్ష్మణ్, రాజు, గోరంతల వెంకటేష్, జీడి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



తాటికొండలో బీసీ మేధోమథనం

- **ప్రముఖ వైద్యుడికి ఆహ్వానం**

స్టేషన్ ఘనపూర్,అక్టోబర్ 4

ఈ నెల 11న జనగామలో నిర్వహించనున్న బీసీ ఇంటలెక్చువల్ ఫోరం సదస్సును విజయవంతం చేయాలని ఫోరం నాయకులు పిలుపునిచ్చారు. స్టేషన్ ఘనపూర్ మండలం తాటికొండ గ్రామంలో శనివారం ప్రముఖ వైద్యుడు డాక్టర్ కె. శ్రావణ్ కుమార్ను ఫోరం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి సదస్సుకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా సదస్సు ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఫోరం జిల్లా అధ్యక్షుడు గద్ద అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీల సామాజిక, విద్యా, రాజకీయ అభ్యున్నతిపై సదస్సులో కీలకంగా చర్చించనున్నట్లు తెలిపారు. బీసీల అభివృద్ధికి అవసరమైన భవిష్యత్ కార్యాచరణపై మేధావులు, విద్యావేత్తలు తమ అభిప్రాయాలను వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు.

బీసీ మేధావులు, విద్యావేత్తలు, వివిధ రంగాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

కార్యక్రమంలో ఫోరం ప్రధాన కార్యదర్శి మారగోని సిద్దయ్య గౌడ్, నాయకులు ప్రభాకర్, ఉమ్మగోని రాజు గౌడ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



విశ్వకర్మల సత్తా చాటాలి..

ఇక తగ్గేదేలే!

- **ఘనపూర్ గడ్డపై గర్జించిన రాష్ట్ర అధ్యక్షుడు బిక్షపతి**

స్టేషన్ ఘనపూర్,అక్టోబర్4

ఇన్నాళ్లు వృత్తికే పరిమితమయ్యామని, ఇక అన్ని రంగాల్లో విశ్వబ్రాహ్మణుల సత్తా చాటాలని విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు బిక్షపతి పిలుపునిచ్చారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో విశ్వకర్మలు ముందుకు సాగాలని అన్నారు.

స్టేషన్ ఘనపూర్ పట్టణంలోని శివునిపల్లిలో ఆదివారం నిర్వహించిన మండల కమిటీ ఎన్నికల సభలో ఆయన మాట్లాడారు. విశ్వకర్మల్లో ఐక్యత లేకపోవడం వల్లే వెనుకబడ్డామని, ఇకనైనా ఐక్యంగా ముందుకు సాగుతూ అన్ని రంగాల్లో తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు.సిరికొండ కుమారస్వామి అధ్యక్షతన, జిల్లా అధ్యక్షుడు దిగోజు నర్సింహాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షుడిగా మారేడుపాక ఉమాశంకర్, అధ్యక్షుడిగా కాసోజు రవీందర్, కార్యదర్శిగా మారేడుపాక రాజు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. విశ్వకర్మల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పని చేస్తామని తెలిపారు.

కార్యక్రమంలో మొగుడుంపురం కిషోర్, కేశోజు అమర్, చెక్కపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

ఖమ్మం, అక్టోబర్ 4



ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజలకు ప్రాథమిక సౌకర్యాలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధికారులను హెచ్చరించారు. ఆదివారం ఎర్రుపాలెం మండలం జమలాపురంలోని వాసిరెడ్డి ఫంక్షన్ హాల్లో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి వివిధ శాఖల అభివృద్ధి, సంక్షేమ పనులపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, అధికారులు బాధ్యతగా, జవాబుదారీతనంతో ప్రజలకు సేవ చేయాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సరఫరా విషయంలో అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని, ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. త్రాగునీటి సమస్య వస్తే వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

మధిర నియోజకవర్గంలో 9 స్కూళ్లను ఆధునికీకరించి అన్ని సదుపాయాలతో మోడల్ స్కూళ్లుగా తీర్చిదిద్దాలని 59 కోట్ల 67 లక్షల రూపాయలను మంజూరు చేశామని, ఆధునికీకరణ, సదుపాయాల కల్పన పనులను వేగవంతం చేసి, విద్యార్థులకు త్వరితగతిన అందుబాటులోకి తేవాలన్నారు.

రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన బ్రిడ్జిల నిర్మాణ పనులను ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరగా పూర్తి చేసి రవాణా సౌకర్యాన్ని సులభతరం చేయాలన్నారు. బ్రిడ్జిల నిర్మాణం ఆలస్యమైతే ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, చేపట్టిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో మధిర పట్టణంలోని 10,000 మంది మహిళలకు వివిధ రంగాల్లో ఉపాధి, స్వయం ఉపాధి కల్పించేలా నైపుణ్య శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం అన్నారు. ప్రస్తుతం డిమాండ్ ఉన్న పనుల్లో నైపుణ్య శిక్షణ ఇస్తే, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు.

రహదారుల విస్తరణ, వివిధ అభివృద్ధి పనులకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాల తరలింపు పనులు వేగంగా సాగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. స్తంభాల తొలగింపు పనులతో అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు.

భూ రీసర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ప్రజా ఫిర్యాదులకు తావులేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం అన్నారు. రిసర్వే ప్రక్రియ తర్వాత రికార్డుల నమోదు జాగ్రత్తగా పూర్తి చేయాలన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు గడువులోగా పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని డిప్యూటీ సీఎం దిశానిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు టీ. మధుసూదన్, వీ. మోహన్ రావు, సి ఈ గౌతం రెడ్డి, ఎస్ ఈ శ్రీనివాసా చారి, పీఆర్ ఎస్ ఈ వెంకట్ రెడ్డి, తహశీల్దార్ సునీత ఎలిజబెత్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణకు నిరంతరం పోరాటం

- **ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా నూతన కమిటీలు ఏర్పాటు**

వరంగల్, అక్టోబర్ 4 :



సమాజంలో ప్రతి ఒక్కరి మానవ హక్కులను పరిరక్షించడంతో పాటు పేదలు, మహిళలు, చిన్నారులకు జరుగుతున్న అన్యాయాలపై నిరంతరం పోరాడుతామని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.సంస్థ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ మెరుగు రమేష్ ఆదేశాల మేరకు ఆదివారం వరంగల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ, వరంగల్ జిల్లాలకు నూతన కమిటీలను ఏర్పాటు చేశారు.కార్యక్రమానికి హైకోర్టు అడ్వకేట్, హ్యూమన్ రైట్స్ అడ్వకేసీ అడ్వైజర్ వ్యవస్థాపకులు సత్య, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కోమండ్ల శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బండి సదానందం, మెరుగు రాంబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి చేరేలా సంస్థ తరపున కృషి చేస్తామన్నారు. పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో సామాన్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులతో పాటు మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులు, అన్యాయాలపై నిరంతరం పోరాడుతామని తెలిపారు.రాష్ట్ర అధ్యక్షుడు కోమండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ..ప్రభుత్వం, ప్రజలకు మధ్య అనుసంధానంగా పనిచేస్తూ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ అవినీతి నిర్మూలనకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బండి సదానందం మాట్లాడుతూ.. నూతన కమిటీ సభ్యులు సంస్థ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. పేదలు, మహిళలు, చిన్నారులకు ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించేందుకు కమిటీ సభ్యులు ముందుండాలని పిలుపునిచ్చారు.

నూతన కమిటీలు ఏర్పాటు

హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా కీర్తి సురేష్, ఉపాధ్యక్షులుగా సీత దుర్గాప్రసాద్, శైలం బాలరాజు, ప్రధాన కార్యదర్శులుగా రేసు మధు, బత్తిని జీవన్, కార్యదర్శులుగా శంకర్ ఠాగూర్, కాలేరు వికాస్, బొజ్జ శ్రీకాంత్ నియమితులయ్యారు.వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా మచిక రవీందర్, ఉపాధ్యక్షుడిగా కొమ్ముల దిలీప్, ప్రధాన కార్యదర్శిగా వేములపల్లి సునీత, కార్యదర్శిగా పల్నాటి మూర్తి నియమితులయ్యారు.

నూతన జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ.. మానవ హక్కులతో పాటు మహిళలు, చిన్నారుల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా ప్రజలకు సేవలందిస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో మానవ హక్కుల పరిరక్షణ కోసం మరింత చురుగ్గా పనిచేస్తామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎద్దు రాజు, కేతనబోయిన నాగరాజు, కనుకుంట్ల దిలీప్, పున్నం చందర్, శెట్టి రమేష్, నగేష్, గడల రమేష్, బుర్రి విజయ్ కుమార్, పల్ల బోయిన మురళీకృష్ణ, ప్రతాప్ రెడ్డి, సునీల్ కుమార్, చల్లగురుగుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజన హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం

హనుమకొండ, అక్టోబర్ 4 :



గిరిజనుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం రాబోయే రోజుల్లో మరిన్ని పోరాటాలు చేపడతామని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వి. వీరన్న నాయక్ తెలిపారు. తెలంగాణ గిరిజన సంఘం హనుమకొండ జిల్లా మూడో మహాసభను శనివారం హనుమకొండ గిరిజన భవన్ ప్రాంతంలో నిర్వహించారు.

బి. లాలు నాయక్, జగన్ నాయక్, సారయ్య, రమేష్ అధ్యక్షతన జరిగిన మహాసభకు వి. వీరన్న నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హనుమకొండ జిల్లాలో నివసిస్తున్న బంజారా, ఎరుకల తదితర గిరిజనుల హక్కులను కాపాడాలని ప్రభుత్వాలను కోరారు. గిరిజనుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత చొరవ చూపాలని డిమాండ్ చేశారు.గిరిజన రిజర్వేషన్లను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాలని, కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేసి నియామకాలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నేపథ్యంలో ప్రైవేట్ రంగంలోనూ గిరిజన రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

బంజారాలు మాట్లాడే గోర్బోలి భాషకు గుర్తింపు కల్పించి రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చాలని మహాసభలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పట్టణ ప్రాంతాలకు వలస వస్తున్న లంబాడి, ఎరుకల గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు కల్పించడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలని, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు, ఆన్‌లైన్ కోచింగ్ ద్వారా శిక్షణ అందించి ఆర్థిక సహకారం కల్పించాలని అన్నారు.గిరిజన హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతి కల్పించడంతో పాటు సిబ్బంది సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు.ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి తగినంత సిబ్బందిని నియమించాలని, కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న గిరిజన ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని మహాసభ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

హనుమకొండ పట్టణంలోని గిరిజన నిరుద్యోగులకు ఐటీడీఏ ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రుణాలు మంజూరు చేయాలని, జిల్లా యూనిట్‌గా తీసుకుని రుణాల కేటాయింపు చేపట్టాలని కోరారు. శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి, తీజ్ పండుగ ఉత్సవాల నిర్వహణ కోసం హనుమకొండలో భూమి కేటాయించాలని ప్రభుత్వాన్ని మహాసభ విజ్ఞప్తి చేసింది. గిరిజనుల సమస్యలను పరిష్కరించేందుకు రాబోయే రోజుల్లో ఐక్యంగా పోరాటాలు నిర్వహిస్తామని నాయకులు తెలిపారు.ఈ మహాసభలో నాయకులు బోనార్తి రవి, ఆర్. సారయ్య, భూక్య సునీల్, గుగులోత్ విజయ్, లావుడియా రాఘవ, అజ్మీర దినేష్ తదితరులు పాల్గొన్నారు.



సామాజిక సేవలో రెడ్‌క్రాస్ కీలక పాత్ర

- **ఓటు హక్కు వినియోగించుకున్న ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి**

కరీంనగర్, అక్టోబర్ 4 :

కరీంనగర్ రెడ్‌క్రాస్ సొసైటీ కమిటీ సభ్యుల ఎన్నికలు ఆదివారం ఉదయం ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆల్ఫోర్స్ డా. వి. నరేందర్ రెడ్డి పాల్గొని తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.
ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సమాజానికి రెడ్‌క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో సహాయ సహకారాలు అందిస్తూ సామాజిక సేవలో రెడ్‌క్రాస్ సొసైటీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకమైన రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యత్వం పొందాలని, తద్వారా సొసైటీ అందించే వివిధ సేవలను వినియోగించుకోవడంతో పాటు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు.
ఎన్నికల సందర్భంగా పలువురు ప్రముఖులను నరేందర్ రెడ్డి కలుసుకుని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, సామాజిక అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పలువురు రెడ్‌క్రాస్ సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కరీంనగర్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలు

- **ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్**

కరీంనగర్, అక్టోబర్ 4 :



జిల్లా కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర డిగ్రీ కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) కరీంనగర్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు ఉత్సాహంగా, ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఎన్నికల్లో భాగంగా కరీంనగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ మంత్రి గంగుల కమలాకర్ పోలింగ్ కేంద్రానికి స్వయంగా చేరుకుని తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ సేవా కార్యక్రమాలను మరింత విస్తరించే నూతన పాలకవర్గం ఎంపిక కోసం జరుగుతున్న ఎన్నికలపై సభ్యుల్లో ఆసక్తి నెలకొంది. పోలింగ్ ప్రక్రియలో జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు, రెడ్‌క్రాస్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు.



ఘనంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి జన్మదిన వేడుకలు

- **వలస వెళ్లినా వీడని అనుబంధం..**

వనపర్తి,అక్టోబర్04 :

మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ రామంతపూర్‌లో బీఆర్ఎస్ యువ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామానికి చెందిన పలువురు యువకులు ఉద్యోగ, ఉపాధి కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. స్వగ్రామానికి దూరంగా ఉన్నప్పటికీ నిరంజన్ రెడ్డిపై ఉన్న అభిమానం మాత్రం చెక్కుచెదరలేదని, అందుకే ప్రతి సంవత్సరం ఆయన జన్మదినాన్ని హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ..మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి హయాంలో వనపర్తి ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సాగునీరు, రహదారులు, విద్య, వైద్య రంగాల్లో జరిగిన అభివృద్ధి చిరస్మరణీయమని పేర్కొన్నారు. వనపర్తి జిల్లా ఏర్పాటుతో పాటు ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. నిరంజన్ రెడ్డి ఆయురారోగ్యాలతో మరిన్ని సంవత్సరాలు ప్రజలకు సేవ లందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇరికిచెట్టి మధు, దయ్యాల జయరాజ్, చంద్రమోహన్, వెంకటగిరి శ్యామ్, కానాపురం శ్రీను, ఏర్పుల రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది

- **త్వరలో ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కృషి**
- **రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

వనపర్తి,అక్టోబర్04 :



ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో ఆటో డ్రైవర్ల కు డిన్నర్ ఏర్పాటు చేసి వారి సమస్యలపై చర్చించారు.ఈ సందర్భంగా ఉపముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో ఆటో జేఏసీ చేస్తున్న కృషిని అభినందించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆటో మీటర్ చార్జీలను పెంచినట్లు తెలిపారు. త్వరలో కేబినెట్‌తో చర్చించి ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.తెలంగాణ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి దయ్యాల దాసు మాట్లాడుతూ.. మీటర్ చార్జీల పెంపు, సంక్షేమ బోర్డు ఏర్పాటుపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు తమ యూనియన్ పూర్తి సహకారం అందిస్తుందని అన్నారు.కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఆటో జేఏసీ చైర్మన్ వేముల మారయ్య, కన్వీనర్ వెంకటేశం, ఐఎన్‌టీయూసీ నాయకులు నరసింహారెడ్డి, మల్లేష్ గౌడ్, నాగన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మీటర్ చార్జీల పెంపు, సంక్షేమ బోర్డుపై ప్రభుత్వ నిర్ణయానికి కృతజ్ఞతలు



- **తెలంగాణ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి దయ్యాల దాసు**

వనపర్తి,అక్టోబర్04 :

ఆటో మీటర్ చార్జీల పెంపుతో పాటు త్వరలో ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వానికి తెలంగాణ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి దయ్యాల దాసు కృతజ్ఞతలు తెలిపారు.హైదరాబాద్ ప్రజాభవన్‌లో శనివారం రాత్రి ఆటో డ్రైవర్లతో నిర్వహించిన డిన్నర్ కార్యక్రమంలో పాల్గొన్న దయ్యాల దాసు మాట్లాడుతూ.. ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో మీటర్ చార్జీల పెంపుపై సానుకూల నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు.అలాగే ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు దిశగా కృషి చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సంక్షేమ బోర్డు ఏర్పాటుతో ఆటో డ్రైవర్లు, వారి కుటుంబాలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టే చర్యలకు తమ యూనియన్ తరపున పూర్తి సహకారం అందిస్తామని దయ్యాల దాసు తెలిపారు.

దొడగుంటపల్లిలో కుక్కల బెడద

- **గుంపులుగా సంచారం.. చిన్నారులు, వృద్ధులకు తీవ్ర ఇబ్బందులు**

పెద్దమందడి,అక్టోబర్04



వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామంలో కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. గ్రామంలోని ప్రధాన రహదారులు, వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో వందకు పైగా కుక్కలు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.కుక్కలు చిన్నారులను వెంబడించడంతో పాటు పలువురిని కరిచిన ఘటనలు చోటుచేసుకున్నాయని గ్రామస్తులు తెలిపారు. వృద్ధులు, మహిళలు రోడ్లపైకి రావాలంటే భయపడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులను కుక్కలు వెంబడిస్తుండటంతో ప్రమాదాల ముప్పు పొంచి ఉందన్నారు.కుక్కల సమస్యను గ్రామపంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామ పెద్దలు, యువజన సంఘాల సభ్యుల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కేవలం ఫిర్యాదులకు పరిమితం కాకుండా సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టి కుక్కల నియంత్రణకు తగిన ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.చిన్నారులు, వృద్ధుల భద్రతకు ముప్పు వాటిల్లే పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో అధికారులు ఇక ఆలస్యం చేయకుండా అత్యవసర చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామసభలో ఈ సమస్యపై ప్రత్యేకంగా చర్చించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సంబంధిత శాఖల సమన్వయంతో సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామ పెద్దలు, యువత కూడా అధికారులకు సహకరించి సమస్య పరిష్కారానికి ముందుకు రావాలని కోరారు.

ఏఐఎస్ఎఫ్‌లో విద్యార్థుల చేరిక

- ***విద్యార్థి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడి పిలుపు***

కరీంనగర్, అక్టోబర్ 4 :



కరీంనగర్ నగరంలోని బొమ్మకల్, జ్యోతినగర్, కిసాన్‌నగర్, మారుతినగర్ ప్రాంతాలకు చెందిన పలువురు విద్యార్థులు ఈరోజు ఏఐఎస్ఎఫ్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంట రెడ్డి నూతనంగా చేరిన విద్యార్థులకు కండువాలు కప్పి, సభ్యత్వం అందజేసి ఏఐఎస్ఎఫ్‌లోకి సాదరంగా ఆహ్వానించారు.
ఈ సందర్భంగా మణికంట రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణతో పాటు విద్యా రంగంలోని సమస్యలపై ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.
విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఏఐఎస్ఎఫ్‌లో చేరి విద్యార్థి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, నూతనంగా చేరిన విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ల ఓటు నమోదుకు విస్తృతంగా అవగాహన

- **అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఫారం-18తో నమోదు చేసుకోవాలి**
- **పలుస శంకర్ గౌడ్ జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు**

శ్రీరంగాపూర్,అక్టోబర్04 :



వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రాడ్యుయేట్లు ఫారం18 దరఖాస్తులను పూర్తి చేసి తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ పాల్గొని మాట్లాడుతూ.. 2023 నవంబర్ నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రతి గ్రాడ్యుయేట్ ముందుకు రావాలని కోరారు. ఫారం18 దరఖాస్తుతో పాటు అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించి గడువులోగా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. పట్టభద్రులు తమ ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండటంతో పాటు తోటి గ్రాడ్యుయేట్లకు కూడా సమాచారం అందించాలని కోరారు.శ్రీరంగాపూర్ మండలంలోని యువత, ఉపాధ్యాయులు, పట్టభద్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శంకర్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. వనపర్తి జిల్లాలో అర్హులైన పట్టభద్రులందరికీ ఓటు నమోదు చేయించడమే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పృథ్వీరాజ్, మండల నాయకులు వెంకటస్వామి, షఫీ, సయ్యద్, శ్రీనివాస గౌడ్, కృష్ణయ్య, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
Follow :
@bhadradrinews
సోమవారం
5 । అక్టోబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి

- **కుటుంబ పోషణ కష్టంగా ఉంది**
- **కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలి: సీపీఐయూ డిమాండ్**

హుజూరాబాద్, అక్టోబర్ 4



గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, వారికి కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని సీపీఐయూ నాయకులు డిమాండ్ చేశారు. హుజూరాబాద్‌లోని సీపీఐయూ కార్యాలయంలో ఆదివారం గ్రామపంచాయతీ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామపంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, వేతనాల పెంపు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

2019 నుంచి వేతనాల పెంపు లేదు

గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు 2019 సంవత్సరం నుంచి వేతనాలు పెరగలేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కేవలం రూ.9,500తో కుటుంబాలను పోషించుకోవడం అత్యంత కష్టంగా మారిందని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, విద్య, వైద్యం, ఇంటి ఖర్చులు భారీగా పెరిగిన నేపథ్యంలో తక్కువ వేతనాలతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

కనీస వేతనం అమలు చేయాలి

గ్రామపంచాయతీల్లో పారిశుధ్యం, వీధుల పరిశుభ్రత, ఇతర ప్రజా సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సీపీఐయూ నాయకులు డిమాండ్ చేశారు. సంవత్సరాల తరబడి సేవలందిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. వెంటనే వేతనాలను పెంచి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి

గ్రామపంచాయతీ కార్మికులపై అదనపు పనిభారం మోపుతున్న మల్టీపర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఒకే కార్మికుడితో అనేక రకాల పనులు చేయించడం వల్ల పని ఒత్తిడి పెరుగుతోందని, దీనివల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్మికుల హక్కులను పరిరక్షించే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

గ్రామపంచాయతీ కార్మికులకు పూర్తి స్థాయిలో ఉద్యోగ భద్రత కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్సరాలుగా గ్రామాల్లో సేవలు అందిస్తున్న కార్మికుల భవిష్యత్తుపై ప్రభుత్వం భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, కనీస వేతనం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

అక్టోబర్ 9న రాష్ట్ర సదస్సు

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. అక్టోబర్ 9న హైదరాబాద్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు వెల్లడించారు.

26న ఛలో ఇందిరాపార్క్

ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఇందులో భాగంగా అక్టోబర్ 26న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని సీపీఐయూ నాయకులు స్పష్టం చేశారు.



మల్లన్నగండిలో మళ్లీ విషాదం..

వీడని మృత్యుఘోష

- **స్నేహితుల కళ్లెదుటే నీటిలో గల్లంతైన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్**

చిల్పూర్,అక్టోబర్4 :

వరుస ప్రమాదాలతో ఆందోళన

మల్లన్నగండి రిజర్వాయర్ వద్ద ఇటీవల చోటుచేసుకుంటున్న వరుస ప్రమాదాలు స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. కేవలం రెండు నెలల వ్యవధిలోనే ముగ్గురు యువకులు నీటిలో మునిగి మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. రిజర్వాయర్ వద్ద తగిన భద్రతా చర్యలు లేకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భద్రత ఎక్కడ..?

రిజర్వాయర్ అందాలను చూసేందుకు వచ్చే పర్యాటకుల భద్రత కోసం ప్రమాదకర ప్రాంతాల్లో కనీసం హెచ్చరిక బోర్డులు, రక్షణ కంచెలు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి అక్కడ పర్యాటకులు నీటిలోకి వెళ్లకుండా కట్టడి చేయాలని, తగిన భద్రతా చర్యలు చేపట్టి మరో కుటుంబానికి కన్నీరు మిగలకుండా చూడాలని వారు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

సరదాగా గడిపేందుకు స్నేహితులతో కలిసి రిజర్వాయర్‌కు వచ్చిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతైన ఘటన జనగామ జిల్లా నర్మేట మండలం మల్లన్నగండి రిజర్వాయర్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న పడాల కళ్యాణ్ (26) ఏడుగురు స్నేహితులతో కలిసి సికింద్రాబాద్ నుంచి మల్లన్నగండి రిజర్వాయర్‌కు వచ్చాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు.కళ్యాణ్ నీటిలో గల్లంతవడంతో స్నేహితులు ఆందోళనకు గురై స్థానికులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు. గల్లంతైన కళ్యాణ్ ఆచూకీ కోసం స్టేషన్ ఘనపూర్ అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

దళిత మహిళా సర్పంచ్‌పై దాడి ఘటనలో.. ఘనపూర్‌లో వేడెక్కిన రాజకీయం

- **నిందితులపై చర్యలు తీసుకోకుంటే వేలాది మందితో రాస్తారోకో**
- **మున్సిపల్ ఎస్సీ సెల్ హెచ్చరిక**

స్టేషన్ ఘనపూర్,అక్టోబర్ 4 :



మండలంలోని విశ్వనాథపురం గ్రామ దళిత మహిళా సర్పంచ్ గుర్రం యాదమ్మ పై అక్రమ మద్యం విక్రయదారులు కులం పేరుతో దూషించి దాడికి పాల్పడ్డారనే ఆరోపణలతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఘటనపై మున్సిపల్ ఎస్సీ సెల్ నాయకులు తీవ్రంగా స్పందించారు. విషయం తెలుసుకున్న ఘనపూర్ మున్సిపాలిటీ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుర్రం ఫాతికుమార్, కమిటీ సభ్యులు ఆదివారం సర్పంచ్ యాదమ్మను కలిసి పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని ఆమెకు సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దళిత మహిళా సర్పంచ్‌ను కులం పేరుతో దూషించి అవమానపరిచి, దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధిపై దాడి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.నిందితులపై తక్షణమే చర్యలు తీసుకోకపోతే మున్సిపాలిటీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో వేలాది మంది దళితులతో నిరసన ర్యాలీలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి తాటికొండ సున్నం యాదగిరి, టౌన్ కార్యదర్శి మాతంగి దేవయ్య, తిరుమలనాథ దేవస్థానం వైస్ చైర్మన్ తాటికొండ యాదగిరి, టౌన్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చేపూరి రమేష్, బాస్కుల రామచంద్రం, సింగపురం ఎల్లేష్, సింగపురం బాబు, గుర్రం వెంకటయ్య, నిరటి రవి, గద్దల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇంకెన్ని శవాలు తేలితే మేల్కొంటారు..?

- **మల్లన్నగండి రిజర్వాయర్ వద్ద ప్రభుత్వ నిర్లక్ష్యంపై బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్ ఆగ్రహం**

స్టేషన్ ఘనపూర్, అక్టోబర్ 4 :



మల్లన్నగండి రిజర్వాయర్‌లో వరుసగా ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఎందుకు స్పందించడం లేదని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్ ప్రశ్నించారు. ఆదివారం రిజర్వాయర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గల్లంతైన ఘటనపై ఆయన స్పందిస్తూ ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒక కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న వ్యక్తి, మరో కుటుంబానికి అప్తుడైన వ్యక్తి ఒక్కసారిగా కనిపించకుండా పోతే ఆ కుటుంబాలు పడే వేదన వర్ణనాతీతమని గణేష్ అన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే మరో ప్రమాదం జరగకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టడమే అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు.

కనీసం హెచ్చరిక బోర్డు కూడా లేదు

మల్లన్నగండి రిజర్వాయర్ వద్ద ప్రమాదకర ప్రాంతాల్లో కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం దారుణమని గణేష్ మండిపడ్డారు. రిజర్వాయర్ అందాలను చూసేందుకు వచ్చే యువత ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సరదాగా గడిపేందుకు వచ్చిన యువత ప్రమాదంలో చిక్కుకుంటే వారి కుటుంబాలు జీవితాంతం కన్నీరు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. “నిన్నటి వరకు నవ్వుతూ తిరిగిన వ్యక్తి ఇవాళ కనిపించకుండా పోయాడు. మరో తల్లి తన బిడ్డ కోసం, మరో భార్య తన భర్త కోసం కన్నీరు పెట్టే పరిస్థితి రాకముందే అధికారులు మేల్కొనాలి” అని అన్నారు.

మల్లన్నగండి రిజర్వాయర్ వద్ద ప్రమాదాల నివారణకు తక్షణమే హెచ్చరిక బోర్డులు, రక్షణ కంచెలు ఏర్పాటు చేయడంతో పాటు గజ ఈతగాళ్లను, రక్షణ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని గణేష్ డిమాండ్ చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించాలని కోరారు.

రెడ్ల కార్పొరేషన్ సాధించాలి

- **రెడ్డి జాగృతి నూతన కమిటీలు ఏకగ్రీవ ఎన్నిక**

స్టేషన్ ఘనపూర్, అక్టోబర్ 4 :



తమ హక్కుల సాధనతో పాటు రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు కోసం ఐక్యంగా పోరాడాలని రెడ్డి జాగృతి నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో రెడ్డి జాగృతి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా, మండల నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా కరెడ్ల రఘునందన్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కిసిరి మాధవ్ రెడ్డి, మండల అధ్యక్షుడిగా చల్లా రఘు రెడ్డి, మండల ఉపాధ్యక్షుడిగా నాయ్యం బుచ్చి రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అనంతరం నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ.. రెడ్డి వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రెడ్డి వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.రెడ్డి జాగృతిని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి, తమ హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్తకు అండగా దాస్యం!

- **కేటీఆర్ ఆదేశాలతో నాగరాజు వర్మను పరామర్శించిన దాస్యం వినయ్‌భాస్కర్**
- **కార్యకర్తకు ఆర్థిక భరోసా కల్పించిన మాజీ చీఫ్ విప్ దాస్యం**

వరంగల్, అక్టోబర్ 4 :



అనారోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న బీఆర్ఎస్ కార్యకర్త మూల నాగరాజు వర్మను మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.మడికొండకు చెందిన నాగరాజు వర్మ అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కేటీఆర్.. నాగరాజు వర్మను పరామర్శించి అవసరమైన సహాయం అందించాలని దాస్యం వినయ్‌భాస్కర్‌ను ఆదేశించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

కేటీఆర్ సూచనల మేరకు దాస్యం వినయ్‌భాస్కర్ నాగరాజు వర్మ నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని, కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్థిక సాయం అందించి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం నాగరాజు ఆరోగ్య పరిస్థితిపై వైద్యుడితో ఫోన్‌లో మాట్లాడిన వినయ్‌భాస్కర్.. ఆయనకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. కష్టాల్లో ఉన్న కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, పోలేపల్లి రామ్మూర్తి, గంద్రకోట రాకేష్ యాదవ్, తక్కెళ్లపల్లి వినీల్ రావు, సుధాకర్, తిరుపతి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై అంతులేని విషాదం..
పుట్టినరోజే చిన్నారికి నూరేళ్లు నిండాయి

హైదరాబాద్, అక్టోబర్ 4 :

నగరంలోని ట్యాంక్‌బండ్‌పై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చిన్నారి పుట్టినరోజు వేడుకల్లో తీవ్ర విషాదం అలుముకుంది. కూతురి జన్మదినాన్ని ఆనందంగా జరుపుకోవాలనుకున్న ఆ కుటుంబానికి శోకం మిగిలింది. అతివేగంగా దూసుకొచ్చిన లారీ రూపంలో మృత్యువు కబలించడంతో చిన్నారితో పాటు మరో బంధువు ప్రాణాలు కోల్పోయారు.

కూకట్‌పల్లిలోని పీవీఆర్ మాల్‌లో చిన్నారి సరాక్షి (6) జన్మదిన వేడుకల సందర్భంగా కుటుంబసభ్యులు సినిమా చూశారు. మూవీ అయిపోయిన వెంటనే చిన్నారితో కలిసి కేక్ కటింగ్ చేసేందుకు వారంతా ఉత్సాహంగా ట్యాంక్‌బండ్‌కు చేరుకున్నారు. ట్యాంక్‌బండ్ వద్ద హుస్సేన్ సాగర్ వైపు రోడ్డు దాటుతున్న సమయంలో ఊహించని ప్రమాదం జరిగింది. అతివేగంగా వచ్చిన లారీ వారిని బలంగా ఢీకొట్టింది. ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో చిన్నారి సరాక్షి (6) అక్కడికక్కడే దుర్మరణం చెందగా, ఆమెతో పాటు ఉన్న మరొక బంధువు కూడా తీవ్ర గాయాలతో ప్రాణాలు కోల్పోయారు. పుట్టినరోజు ఆనందంలో ఉండాల్సిన కుటుంబం ఈ అకస్మాత్తు ఘటనతో కోలుకోలేని శోకసంద్రంలో మునిగిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పాట్‌కు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

Printed, Published and Owned by CHENGAPONGUSAIDULU,and printed at KAKATI BABU PRINTERS H No.4-10.Telagarama varam,Laximidevipally, Kothagudem -507101,Dist .Bhadradri kothagudem, Telangana. And Published At HNo. DA-416,Babu camp,chunchupalli (M), Kothagudem-507101,Dist Bhadradri kothagudem, Telangana.Editor: CHENGAPONGU SAIDULU. RNI TELTEL 2023/90682Call No.6302329046